


# జిహ్వాకొక రుచి ★

రచన :
"శ్రీ సాయి శ్రీ"

"ఏమయ్యా! ఇది అన్నమేనా? తినాలా? లేక చావాలా? రోజుకు రోజుకు గడ్డిలాగ తయారైతుంది! ఎన్నిరోజులని సర్దుకొనిపోనూ, రెండు పూటల నాతోపాటు టిఫన్, కాఫీ, అన్నంమెక్కి నెల తిరిగేటప్పటికి జీతం ఠంచనుగా తీసుకుంటూవున్నావేఅనే బాధన్నా వుంటొద్దు? ఛా! ఇదేం పచ్చడి! వుప్పులేదు పప్పులో! బంగాళాదుంప కూరలో కారం లేదు. శుద్ధమొద్దవతారంగా చూస్తావేం? నోరు లేదూ?" అని పెళపెళలాడిపోయాడు తాశిల్దారు చెంగయ్యా వంటమనిషిమీద.

పెళ్లాం రంగమ్మ మూడో కాన్పుకు అమ్మగారింటికి పోయినందువల్ల ఆయన నెల రోజులనుంచి వంటమనిషిని పెట్టుకోవాల్సి వచ్చింది. నిజానికి వంటమనిషి సుబ్బయ్యా చేతిఅన్నం అమృతోపమానం! కాని ఏదో విధంగా వంకలు పెట్టేరకం. మనుషులకు అమృతం కూడా వేపకాయల కషాయంలా గుంటుందనటం సందేహమా? తృప్తిలేని మనిషికి ముక్తి లేదు! రోజు ఇంతే!

సుబ్బయ్యా ఎంతో సహనంతో ఓర్చుకుంటూ వచ్చాడు. ఎంత వంగినా ఇంకా సాగతీస్తే ఎదురు తిరక్కపోదు ఏ ప్రాణి అయినా! "నోరు లేదూ?" అన్న మాటతో అతనిలోని సహనం చచ్చింది. వెంటనే "వుందండి!" అన్నాడు నిశ్చలంగా. దానితో చెంగయ్యాగార్కి మండింది.

"దానితో అన్నమే తింటున్నావా?"

"మరేమండి! అన్నమే!" అని రెట్టించి ముట్టించి వదిలాడు సుబ్బయ్యా.

"ఒహో! అలాగా? గడ్డి అనుకున్నాలే" అన్నారు చెంగయ్యాగారు భ్రూముడినుండి నిప్పులు కక్కుతూ.

"దానిదేముందిలెండి! పెద్దపెద్దవారే తినాల్సిన కాలం వస్తే తింటారు!"

"అంతేలే!" అని రుసరుసలాడాడు, గబగబా నాలుగు ముద్దలు నోటి కడ్డముగా కొట్టుకొని, చెంగయ్యాగారు.

ఆఫీసుకు పోయాడు చెంగయ్యా. సుబ్బయ్యాప్రాణం తుకతుక వుడికిపోయింది.

"వెధవ జీవితం! ఎంత బాగా చేసినా బాగున్నదనని వ్యక్తి జిహ్వ కాల్చనా?" అనుకున్నాడు.

సూర్యుడు చకచకసాగి పశ్చిమాంబుధిలో మునిగిపోయాడు. కాలం ఎవ్వరికోసం ఆగదు;

* * *

చూస్తుండగానే రాత్రి అయింది.

"సుబ్బయ్యాగారు!"

"ఏమండీ!"

"ఈవేళ ఇంత బాగుందేం ఈ పచ్చడి! కొంచెం వడ్డించండి!" అన్నారు చెంగయ్యాగారు మూడోసారివేసిన పట్టెడు పచ్చడి కూడా తినేసి. సుబ్బయ్యా ఇంకొంచెం వడ్డించాడు. దివ్యంగా వుందంటూ అది కూడా పులుసులేనే నల్చుకుంటూ తినేశాడు ఆ తాసిల్దారుగారు.

"ఈవేళ చాలా బాగుందనుకుంటాను నా వంట" అన్నాడు సుబ్బయ్యా.

నలభీమపాకం! ఇన్ని రోజులనుంచి యిలా వేయలేదు....పెరుగు!

సుబ్బయ్యా పెరుగు పోశాడు. కొంచెం ఆ పచ్చడి వేయండి! చెంగయ్యా అన్నాడు పెరుగు కల్పుతూ.

"దానికేం భాగ్యం అంటూ దొడ్లోకెళ్లి పట్టెడు పచ్చిగడ్డి పీక్కొనివచ్చి అతని విస్తరిలో వేశాడు సుబ్బయ్యా.

'ఏమిటిదీ?' అన్నాడు చెంగయ్యా రౌద్రరూపం దాల్చి.

అదా పచ్చిగడ్డి! మీరు అడిగారుగా వుదయం గడ్డి తింటున్నావా అని. దానిదేముంది సమయంవస్తే పెద్దవారే తింటారు లొట్టలేస్తూ అన్నా. గుర్తుందా చెంగయ్యాగారూ? మీరు ఇందాకనుంచి తిన్నది ఈ పచ్చిగడ్డితో చేసిన పచ్చడే! ఇప్పుడు తెల్సిందనుకుంటాను గడ్డి ఎవ్వరు తిన్నారో!

ఏమిటీ ఆగాయిత్యం? నేనెవరో తెల్సుగా? ఏం చేస్తానో చూడు.

ఏం చేస్తారూ ? నీవేం చేయకముందే నేను వెళ్లిపోతున్నా. నీ డబ్బు నా కొద్దు నావంట నీకొద్దు! నన్ను ఏదైనా చేయటానికి ప్రయత్నం చేశారా శుభ్రంగా మీరు గడ్డి నాల్గుసార్లు తిన్నారని, నేనే తినిపించానని డప్పు కొట్టి వూరంత దండోరా వేయిస్తా నాలుగు రూపాయలుయిచ్చి. ఛీ! వుత్త తృప్తిలేని మనిషివి అంటూ పైపంచ విదిలించుకొని వెళ్లిపోయాడు సుబ్బయ్యా.

తాసిల్దారు చెంగయ్యా నోరుతెర్చుకొని కళ్లు అప్పగించిచూస్తూ వూరుకున్నారు చేసేదిలేక.

విస్తరిలోవున్న పచ్చిగడ్డి పకపక లాడింది. కల్పుకున్న పెరుగన్నం వెలవెలపోయింది తెల్లగా.

